



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 234 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 12-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00

## ఆందోళనకరంగా
# అమిత్ షా తీరు

- ఆయన భాష కూడా సరిగా లేదు
- విపక్ష నేత రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ,
ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభ సమావేశాల్లో జరిగిన చర్చ సందర్భంగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆందోళనకరంగా ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆయన భాష కూడా స్పష్టంగా లేదని..అమిత్ షా ప్రసంగాన్ని ఉద్దేశించి అన్నారు. బుధవారం నాటి సమావేశంలో.. ఓటు చోరీ అంశంపై మీడియా ముందు నేను చేసిన వ్యాఖ్యలను పార్లమెంట్‌లో చర్చకు తీసుకురావాలని అమిత్ షాకు సవాల్ విసిరాను. ఆ సమయంలో ఆయన ఆందోళనకరంగా కనిపించారు. భాష కూడా సరిగ్గా లేదు. చేతులు వణుకుతూ కనిపించాయి. ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పలేకపోయారు. ఎలాంటి ఆధారాలూ చూపడం లేదు. మానసికంగా ఒత్తిడికి లోనయ్యారు. మీరూ ఆ విషయాన్ని గమనించే ఉంటారు' అని అమిత్ షానుద్దేశించి రాహుల్ అన్నారు. అయితే.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ వర్గాలు స్పందిస్తూ.. నిన్న చర్చలు జరిగే సమయానికి అమిత్ షా అనారోగ్యానికి

-మిగతా 2 లో






## తొలివిడతలో
# కాంగ్రెస్ హవా



### అనేక గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం

- 90శాతం సర్పంచ్ స్థానాల్లో పాగా
- అత్యధిక సీట్లు గెల్చుకున్న కాంగ్రెస్ మద్దతుదారులు
- పోలింగ్ జరిగిన స్థానాలతో పాటు, ఎన్నికలు ఏకగ్రీవమైన ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులదే పైచేయి
- కాంగ్రెస్: 1733, బీఆర్ఎస్ 721, బీజేపీ 133 ఇతరులు 311 స్థానాల్లో గెలుపు

హైదరాబాద్ - డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
స్థానిక ఎన్నికల తొలి విడతలో కాంగ్రెస్ సత్తా చాటింది. అనేక గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాదించారు. దాదాపు 90శాతం స్థానాల్లో విజయ ఢంకా ఎగురేశారు. తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి తమ హవాను చాటారు. మొత్తం 4,231 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరగ్గా, వెలువడుతున్న తొలి ఫలితాల్లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఇదిలా ఉండగా.. గురువారం సాయంత్రం సమయానికి వెలువడిన ఫలితాలు ఇలా ఉన్నాయి... కాంగ్రెస్: 1733, బీఆర్ఎస్ 721,

-మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో
# కీలక మలుపు

- ఏడు రోజుల సిట్ కస్టడీకి మాజీ ఐజీ ప్రభాకర్‌రావు
- విచారణలో బీఆర్ఎస్ చీఫ్ వైపునకు సాగనున్న దర్యాప్తు
- ఏర్పాట్లు చేస్తున్న సిట్ అధికారులు



హైదరాబాద్ - డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు గురువారం దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో కీలక మలుపు తిరిగింది. ఇప్పటివరకు ముందస్తు బెయిల్‌పై ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును సిట్ ఏడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించవచ్చని సుప్రీం ఇచ్చిన ఆదేశాలు సర్వత్రా ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రభాకర్‌రావు గత మే నెలలో సుప్రీం నుంచి ముందస్తు బెయిల్ పొందారు. ఆనాటి నుంచి ఆయన అరెస్టుకు అనుమతి కోరుతూ సిట్ అధికారులు సుప్రీంలో పిటిషన్‌లు వేస్తూనే ఉన్నారు.

-మిగతా 2 లో

# వంటింటి సామాన్లతో సిద్ధంగా ఉండండి

- సర్‌లో ఓట్లు తొలగిస్తే దాడి చేయండి
- మహిళలకు మమతా బెనర్జీ పిలుపు



కోల్‌కతా, -
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ మరోమారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా గురువారం మహిళలను ఉసిగొల్పారు. ఆ సవరణ తర్వాత ఓటరు జాబితాలో పేర్లు తొలగింపునకు గురైతే కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా

-మిగతా 2 లో

## అమెరికా బాటలోనే
# మెక్సికో

- భారత్‌పై 50 శాతానికి సుంకాలు పెంపు
- దుస్తులు, లోహాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఉక్కు సహా అనేక ఉత్పత్తులపై వీటి ప్రభావం



న్యూఢిల్లీ,- డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
భారత్‌పై అమెరికా భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ట్రంప్ నిర్ణయంతో భారత్–అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇక ఇప్పుడు తాజాగా అమెరికా బాటలోనే మరో దేశం కూడా ఇండియాకి షాకిచ్చింది. భారత్ సహా పలు దక్షిణాసియా దేశాల పై సుంకాలు విధించేందుకు మెక్సికో సిద్ధమైంది.భారత్, చైనా, దక్షిణ కొరియా వంటి పలు దక్షిణాసియా దేశాల నుంచి వచ్చే దిగుమతులపై భారీగా సుంకాల్ని పెంచే బిల్లుకు మెక్సికన్ సెనెట్ బుధవారం ఆమోదం తెలిపింది. కనీసం 5 శాతం నుంచి 50 శాతం వరకు దిగుమతి సుంకాల్ని పెంచే బిల్లుకు మెక్సికో

-మిగతా 2 లో

## ఫార్మా కంపెనీలపై 'డ్రగ్ ఇన్స్పెక్షన్లు'..
# కానీ అసలు పరిశీలన ఎక్కడ..?

### "డ్రగ్ ఇన్స్పెక్షన్‌ల పేరిట డ్రామా?

- తనిఖీలు కేవలం పేపర్‌మీదే?
- "ఫార్మా తనిఖీల్లో 'సెటిల్మెంట్' సునామీ?
- ఆఫీసు నుంచి బయల్దేరిన ఇన్స్పెక్టర్లు... ఫ్యాక్టరీల గేట్ల వద్దే 'క్లియర్' సర్టిఫికెట్లు?




హైదరాబాద్, డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :
దేశంలో ఔషధ తయారీ రంగానికి కేంద్రబిందువైన హైదరాబాద్‌లో ఫార్మా పరిశ్రమ వేగంగా ఎదుగుతున్నా ఇక్కడ నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్స్పెక్షన్లపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమలోని కార్మికులు, మధ్యస్థ స్థాయి సిబ్బంది, పదవీ విరమణ చేసిన నిపుణులు పలువురు ఇచ్చిన సమాచారాన్ని బట్టి, కొన్ని తనిఖీలు కేవలం "ఫార్మాలిటీ"గానే జరుగుతున్నాయన్న అభిప్రాయం బలపడుతోంది.

**ఆఫీసు నుంచి బయల్దేరిన ఇన్స్పెక్టర్లు ఫ్యాక్టరీల గేట్ల వద్దే 'క్లియర్' సర్టిఫికెట్లు?**

సాధారణంగా డ్రగ్ ఇన్స్పెక్షన్ అంటే ఉత్పత్తి ప్రక్రియ పరిశీలన రా మెటీరియల్

-మిగతా 2 లో





# కేటీఆర్ పరువు నష్టం దావా..

- మంత్రి కొండా సురేఖపై నాన్ బెయిలబుల్ వారెంట్




హైదరాబాద్ - డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాకిచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం దావా కేసులో నాంపల్లి స్పెషల్ కోర్టు కొండా సురేఖపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.నాంపల్లి స్పెషల్ కోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది. కొండా సురేఖను అరెస్ట్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టేలా

-మిగతా 2 లో

## మీరు చేయాల్సిన పనులు
# నాకే చెబితే ఎలా?

- మంత్రులతో సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- కేబినేట్‌కు మంత్రుల ఆలస్యంపై ఆగ్రహం



అమరావతి,
ఏపీ కేబినెట్ సమావేలో పలు కీలక ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం పలు అంశాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో భూ కేటాయింపులు, రెవెన్యూ సమస్యలపై జిల్లాలో సమీక్షించాలని ఇంచార్జి మంత్రులను సీఎం ఆదేశించారు. మంత్రులు పరిష్కరించాల్సిన పనులను తమ దృష్టికి తీసుకొస్తే ఎలా అని సీఎం ప్రశ్నించారు. ఇక చేనేతలకు ఉచిత విద్యుత్ అంశాన్ని ఆర్థిక శాఖ పెండింగ్‌లో ఉంచడంపై పలువురు మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సూర్యఘర్‌తో అనుసంధానం చేశారని మంత్రులు చెప్పారు. అయితే సూర్యఘర్‌తో సంబంధం లేకుండా చూడాలని... దీనిని వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా జగనన్న కాలనీలో గృహాలు నిర్మించని లబ్దిదారుల పట్టాలు రద్దు చేయాలని పలువురు మంత్రులు కోరారు. చాలా ప్రాంతాల్లో ఇల్లు నిర్మించకుండా వృధాగా ఉన్నాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇప్పటికే లబ్దిదారుల పేరిట స్థలాలు రిజిస్టర్ అయి ఉన్నాయని మరికొంతమంది మంత్రులు చెప్పారు. పట్టాలు రద్దు చేయడం సాధ్యం

-మిగతా 2 లో

## ఆందోళనకరంగా
# అమిత్ షా తీరు

మొదటి తరువాయి

గురయ్యారని తెలిపాయి. లోక్ సభలో ప్రసంగించేందుకు లేచి నిల్చున్నప్పుడు ఆయన 102 డిగ్రీల జ్వరంతో ఇబ్బంది పడ్డారని చెప్పాయి. సమావేశం ప్రారంభానికి ముందే ఆయన్ను వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారని పేర్కొన్నాయి. కాగా, ఈ చర్చ సందర్భంగా.. అమిత్ షా సుమారు 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఓటు చోరీ అంశంపై రాహుల్ చేస్తున్న ఆరోపణల్ని కొట్టిపారేశారాయన. కాంగ్రెస్ పార్టీయే ఓటు చోరీకి పాల్పడిందని, నాయకత్వ లోపమే ఆ పార్టీ ఎన్నికల్లో పరాజయం చెందడానికి కారణమని షా విమర్శించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో
# కీలక మలుపు

మొదటి తరువాయి

ఈ నేపథ్యంలోనే తాజా తీర్పు వెలువడింది. శుక్రవారం నుంచి ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అధికారులు జూబ్లీహిల్స్ ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సిట్ దర్యాప్తునకు నేతృత్వం వహిస్తున్న ఏసీబీ వెంకటగిరి గురువారం ఉన్నతాధికారులతో చర్చించి, విచారణలో ఏయే అధికారి ఉండాలనే దానిపై నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మరోపక్క ప్రభాకర్‌రావు విచారణలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆదేశాలిచ్చింది ఎవరనే అంశంపై దర్యాప్తు సాగనున్నట్టు సిట్ తేల్చింది. ఇందుకోసమే ఉద్యోగ విరమణ చేసిన ప్రభాకర్‌రావును ఎస్‌ఐబీ వంటి అత్యంత కీలకమైన విభాగంలో చీఫ్‌గా కొనసాగడానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలిచ్చారని సిట్ అనుమానిస్తోంది. అందుకు తగిన విధంగానే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు నడిచాయని, దాని వల్ల బీఆర్‌ఎస్ నాయకత్వం రాజకీయ లబ్ధిని కూడా పొందిందని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి విచారణ సాగనున్న ప్రభాకర్‌రావు విచారణ వైపే రాజకీయ వర్గాల దృష్టి నిలిచింది.

## వంటింటి సామాన్లతో సిద్ధంగా ఉండండి

మొదటి తరువాయి

ఉండాలని వ్యాఖ్యలు చేశారు. ఎస్‌ఐఆర్ పేరుతో మీ తల్లులు, సోదరీమణుల ఓట్లను లాక్కుంటారా..? ఎన్నికల సమయంలో ఢిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి మిమ్మల్ని బెదిరిస్తారు. జాబితాలో మీ పేరు లేకపోతే..మీ వద్ద వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయికదా..! వంటచేసేటప్పుడు వాడే ఆ పరికరాలు మీ బలం. మహిళలు ముందుండి పోరాడుతారు. మగవారు వారివెనక ఉంటారు. మహిళలా లేక భాజపానా..? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను. నేను లౌకికవాదాన్నే నమ్ముతాను. ఇక్కడి ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో భాజపా డబ్బు వాడి, వేరే రాష్ట్రాల నుంచి మనుషుల్ని దింపుతుంటుంది. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాశ్ చంద్రబోస్ వంటివారు ఏనాడు ప్రజలను విభజించేలా వ్యవహరించలేదు. మరి మీరంతా ఎవరు..? భారత స్వాతంత్య్రం కోసం బెంగాల్ ప్రజలు ప్రాణాలు త్యాగం చేశారు. ఇప్పుడు భారత పౌరులుగా నిరూపించుకోవాలని కృష్ణానగర్ ప్రాంతంలో నిర్వహించిన ర్యాలీలో దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో భాజపా ఎంపీలకు ఇటీవల ప్రధాని మోదీ (ఖఓ ఓనీటతి) దిశానిర్దేశర చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు

## అమెరికా బాటలోనే మెక్సికో

మొదటి తరువాయి

సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు 76 మంది అనుకూలంగా, 5 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. కొత్త సుంకాలు వచ్చే ఏడాది నుంచే అమల్లోకి రానున్నాయి. దుస్తులు, లోహాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఉక్కు సహా అనేక ఉత్పత్తులపై వీటి ప్రభావం పడనుంది. ఈ నిర్ణయంతో దక్షిణాసియా దేశాలపై మెక్సికో వాణిజ్య యుద్ధం ప్రకటించినట్లైంది. ఈ సుంకాలు దేశీయ తయారీని పెంచేందుకు, ముఖ్యంగా చైనాతో పెరుగుతున్న వాణిజ్య అసమతుల్యతలను పరిష్కరించడానికి ఉద్దేశించినవిగా క్లాడియా ప్రభుత్వం చెబుతోంది.


## కేటీఆర్ పరువు నష్టం దావా..

మొదటి తరువాయి

పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. తన పేరు ప్రతిష్టలకు భంగం కలిగించేలా మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం నిరాధారమైన ఆరోపణలు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. బీఎన్‌ఎస్ సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కేటీఆర్ కోరారు.

## మీరు చేయాల్సిన పనులు
# నాకే చెబితే ఎలా?

మొదటి తరువాయి



కాదని సీఎం దృష్టికి మంత్రి అచ్చెన్నాయుడు తీసుకెళ్లగా.. ఇది నిజమేనని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా తెలిపారు. దీనిపై మంత్రులు కూర్చొని ఆలోచించాలని ముఖ్యమంత్రి సూచించారు. లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి ఇల్లు నిర్మిస్తారా? లేదా? అనేది తెలుసు కోవాలన్నారు. ఒకవేళ ఇల్లు కట్టుకోకపోతే కొత్త లబ్ధిదారులకు మూడు సెంట్లు ఇవ్వాలని గతంలో చెప్పిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. అలాగే రెవెన్యూ సమస్యలన్నీ కూడా ఏడాదిలోగా పరిష్కరించాలని సీనియర్ ఐఏఎస్ అధికారి సాయి ప్రసాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయితే, కేబినెట్ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన నలుగురు మంత్రులపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. మంత్రివర్గ సమావేశానికి ఆలస్యంగా వస్తే ఎలా అని ప్రశ్నించారు. కనీసం సరైన క్రమశిక్షణ పాటించాలి కదా అని మందలించారు. మంత్రి మండలి సమావేశం ఉదయం 10:30 గంటలకు అని ముందే తెలుసు కదా అని నిలదీశారు. ఈ సమావేశానికి తగ్గినట్లుగా మంత్రులు ఎందుకు ప్లాన్ చేసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సారి నుంచి కేబినెట్ భేటీకి ఆలస్యంగా వస్తే సహించేది లేదని మంత్రులకు వార్నింగ్ ఇచ్చారు

# తొలివిడతలో కాంగ్రెస్ హవా

మొదటి తరువాయి

బీజేపీ 133 ఇతరులు 311 స్థానాల్లో గెలుపొందారు.90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ నాయకులు దీనిని ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదంగా అభివర్ణించారు. పంచాయతీ ఎన్నికలలో భాగంగా తొలి విడత పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. తొలి విడతలో 3,834 సర్పంచ్, 27,628 వార్డ్ మెంబర్ స్థానాలకు పోలింగ్ జరిగింది. సాధారణ ఎన్నికలతో పోల్చితే సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్ల నుంచి భారీ స్పందన వచ్చింది. ఒక్కో జిల్లాల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ జరిగిన స్థానాలతో పాటు, ఎన్నికలు ఏకగ్రీవమైన ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులదే పైచేయిగా ఉంది. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏకగ్రీవమైన 45 సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ ఏకంగా 32 స్థానాలను దక్కించుకుంది. నల్గొండ జిల్లాలో 17, సూర్యాపేట జిల్లాలో 5, యాదాద్రి జిల్లాలో 10 ఏకగ్రీవ స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు విజయ ఢంకా మోగించారు. మొదటి విడతలో 3,834 గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరగ్గా, కౌంటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. బ్యాలెట్ పత్రాల లెక్కింపు మ్యాన్యువల్‌గా జరుగుతున్నందున, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఫలితాలు వెల్లడికావడానికి కొంత ఆలస్యం అవుతోంది. ఎంత ఆలస్యమైనా ఈరోజే ఉప సర్పంచ్ ఎన్నికను కూడా పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో దాదాపు 79.15శాతం పోలింగ్ నమోదైంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవాలు నిర్వహించకుండా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ దాదాపు ప్రశాంతంగా ముగిసింది.. క్యూ లైన్ లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు అధికారులు.. పోలింగ్ కేంద్రం ఆవరణలో మధ్యాహ్నం 1 గంటలోపు ఉన్న వారికి టోకెన్లు జారీ చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బ్యాక్స్ లను సీల్ చేశారు.. మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. మొదట పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపు చేపట్టారు.. సర్పంచ్, వార్డు మెంబర్ల బ్యాలెట్ పత్రాలు వేరు చేసి, కట్టలు కట్టే ప్రక్రియ కొనసాగించారు.. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 87.93 శాతం పోలింగ్. మెదక్ జిల్లాలో 86 శాతం పోలింగ్ నమోదు. వరంగల్ జిల్లాలో 81.2 శాతం పోలింగ్ నమోదు. ములుగు జిల్లాలో 73.57 శాతం, హన్మకొండలో



75.6 శాతం, జనగాంలో 71.96 శాతం పోలింగ్ నమోదు. సూర్యాపేట జిల్లాలో 87.77 శాతం పోలింగ్ నమోదు. నల్గొండ జిల్లాలో 81.63 శాతం పోలింగ్ నమోదు. నిర్మల్ జిల్లాలో 79.81 శాతం పోలింగ్ నమోదు. ఆదిలాబాద్‌లో 69.10 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మంచిర్యాల జిల్లాలో 77.34 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. వరంగల్ జిల్లాలో 81.2? ఓటింగ్ నమోదు.. 1గంటకు పోలింగ్ కేంద్రాల ప్రధాన గేట్లకు తాళాలు.. పోలింగ్ బూత్ ల వద్ద బారులు తీరిన ఓటర్లు.. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా మధ్యాహ్నం 1గంట వరకు 84.2 శాతం పోలింగ్ నమోదు.. 10 నుంచి 12 శాతం ఓటర్లు క్యూ లైనల్లోనే.. 1గంట వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.. భద్రాచలం, సారపాక మేజర్ పంచాయతీలో ఇంకా బారులు తీరిన ఓటర్లు.. గేట్లు వేసి లోపల ఉన్న వారికి ఓటింగ్‌కు అవకాశం ఇచ్చారు. ఖమ్మం జిల్లా మంచుకొండ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఏసీపీ రమణమూర్తిని పోలింగ్ ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట జిల్లా ములుగు (మం) బహిలంపూర్ గ్రామంలో పోలీసులకు, గ్రామస్థుల మధ్య వాగ్వాదం.. జరిగింది. పోలింగ్ కేంద్రం వద్దకి గుంపులు గుంపులుగా రావొద్దన్న పోలీసులు.. ప్రశాంతంగా నడుస్తున్న పోలింగ్ సరళిని పోలీసులు చెడగొడుతున్నారని గ్రామస్థుల ఆగ్రహం. వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం తోటగోపాయ్యపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మదరవేన పర్వతాలు యాదవ్ ను మంథని సీఐ రాజు ఇంటి లోపల నుంచి బయటకు ఈడ్చుకుంటూ వచ్చి లాఠీతో తీవ్రంగా దాడి చేసినట్లు గ్రామ ప్రజలు ఆరోపించారు. ఈ సందర్భంగా బాధితుడు పర్వతాలు యాదవ్ మాట్లాడుతూ తాను నిన్న రాత్రి మంథని నుంచి ఇంటికి వస్తుండగా లక్కేపూర్ గ్రామానికి చెందిన కొంతమంది తన ద్విచక్ర వాహనానికి అడ్డు వచ్చి నాతో గోడవ పడి దాడి చేశారని తెలిపారు. తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో రుద్రంగి మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.. ప్రజల స్పందన చూస్తే మొదటి విడత జరుగుతున్న ఎన్నికల్లో తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుస్తారన్న ధీమా.. రెండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నాం.. పదేళ్లపాటు పాలించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్టాన్ని అప్పుల కుప్పగా మార్చింది.. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్ పై హరీష్ రావు కేటీఆర్ తెలంగాణకు పేరు వస్తే ఎందుకు ఇంత కడుపు మంట.. తెలంగాణ సబ్బండ వర్గాలు అభివృద్ధి కోరుకుంటే, దుబాయ్ వాట్సప్ గ్రూపుల ద్వారా విష ప్రచారం చేయడం, ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరైనది కాదన్నారు.

శంషాబాద్‌లో బ్యాలెట్ పత్రాన్న చింపేసిన వ్యక్తిపై కేసు నమోదు అయ్యింది. శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ పరిధిలోని బురుజు గడ్డ తండాలో పోలింగ్ కేంద్రంలో ఉదయం ఓటు వేసేందుకు వచ్చిన వ్యక్తి బ్యాలెట్ పత్రాన్ని చించి వేశారు. ఈ ఘటనలో ఎలక్షన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డి గూడ గ్రామంలో ఎన్నికల సరళిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పరిశీలించారు. ప్రజలు ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణం లో తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని అన్నారు. ఐఐటీ గౌహతిలో థర్డ్ ఇయర్ చదువుతున్న అశ్విత.. ఓటు వేయడానికి ఐఐటీ గౌహతి నుంచి కంది గ్రామానికి వచ్చి ఓటు వేసింది.తొలి విడత పంచాయతీ ఎన్నికలు వేములవాడ నియోజకవర్గంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వేములవాడ అర్బన్ మండలం అనుపురంలో తన తల్లిని గెలిపించాలని ఓటర్లను వేడుకుంటున్న యువతి పలువురిని ఆకర్షిస్తుంది. మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ ప్రస్తుతం ఊపందుకుంది. అనుపురం గ్రామంలో ఎస్సీ మహిళ స్థానానికి ముగ్గురి మధ్యలో తీవ్ర పోటీ ఉంది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి బారులు తీరారు. గజ్వేల్ మండలం అక్కారంలో ప్రలోభాల పర్వం.. కారులో తరలిస్తున్న రూ. 2.25 లక్షలు పట్టుకున్న పోలీసులు.. జగదేవ్ పూర్ సర్పంచ్ అభ్యర్థి డబ్బుగా పోలీసుల అనుమానం.. జనకం పెట్ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించిన కలెక్టర్ వినయ్ కృష్ణ రెడ్డి.. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుంది.. ఒంటి గంటగంటకు క్యూలైన్లో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తాం.. అన్నారు.

# ఫార్మా కంపెనీలపై 'డ్రగ్ ఇన్స్పెక్షన్లు'.. కానీ అసలు పరిశీలన ఎక్కడ..?

మొదటి తరువాయి

నాణ్యత తనిఖీ స్టెరిలిటీ, సేఫ్టీ పారామీటర్ల రికార్డుల పరిశీలన వర్కర్ల సేఫ్టీ మానిటరింగ్ ఇవన్నీ క్షుణ్ణంగా పరిశీలించాల్సిందే. కానీ ఇక్కడ అనేక ఫ్యాక్టరీల్లో, తనిఖీలు లోపలికి వెళ్లకుండానే ముగుస్తున్నాయి అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా చోట్ల "సైరన్ మోగగానే సర్దుబాట్లు" అనే అప్రకటిత పద్ధతి జరుగుతోందని పరిశ్రమలోని ఉద్యోగులు చెబుతున్నారు. అంటే, ఇన్స్పెక్టర్ రానున్నాడని సమాచారం ముందే కంపెనీలకు చేరుతోందన్న విమర్శ.

– మధ్యవర్తులు, అనధికారిక లాబీయింగ్ "ఇన్స్పెక్షన్ సాఫీగా జరుగుతుంది" అంటూ హామీలు పలువురు ఉద్యోగుల వాంగ్మూలం ప్రకారం, కొంతమంది మధ్యవర్తులు ఇన్స్పెక్షన్లను కూడా ఒక వ్యాపారంలా మార్చేశారు."ఇన్స్పెక్షన్ క్లీన్‌గా ముగుస్తుంది", "పేపర్లు సెట్ చేస్తాం", "పైకి ఏమీ కనిపించనీయము" అంటూ కొందరు అనధికారిక సమీకరణలు చేస్తున్నారన్న వార్తలు వస్తున్నాయి.

**– ఈ వ్యవస్థలో ఎవరు ఉన్నారు? ఎంత వరకు నిజం?**

ఇది స్పష్టంగా బయటకు రాకపోయినా, పరిశ్రమ మొత్తం మీద ఈ వాతావరణం ఒక సందేహాన్ని నెలకొల్పుతోంది.

**– నాణ్యత లోపించిన మందులు మార్కెట్లోకి వచ్చే ప్రమాదం**

**తనిఖీలు బలహీనపడితే :**




- నాణ్యత లేని బ్యాచ్‌లు మార్కెట్లోకి వచ్చే ప్రమాదం
- ఎక్స్పైరీ లేదా సబ్‌స్టాండర్డ్ రా మెటీరియల్ వినియోగం
- అంతర్జాతీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం
- భారత ఫార్మా నమ్మకతపై దెబ్బ

ఇవి నిపుణులు హెచ్చరిస్తున్న ప్రధాన అంశాలు. "ఔషధంలో ఒక్క చిన్న లోపమే ప్రాణాలను తీసే ప్రమాదం. ఇన్స్పెక్షన్లు రాజీ పడడం అంటే ప్రజారోగ్యానికి నేరుగా నష్టం" అని రిటైర్డ్ డ్రగ్ కంట్రోల్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

**కంపెనీల సమాధానం: "అన్ని ఇన్స్పెక్షన్లు నిబంధనల ప్రకారమే"**

ఫార్మా రంగ ప్రతినిధులు మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు."మా సంస్థలు WHO-GMP, USFDA వంటి ప్రమాణాలతో పనిచేస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు వాస్తవాలు కావు" అని వారి సమాధానం. అయితే, ఉద్యోగుల వాంగ్మూలం గ్రౌండ్ రిపోర్టులు –లీకైన వివరాలు మాత్రం పరిస్థితి అంత సరళంగా లేదని చెబుతున్నాయి.

**– రాష్ట్ర ప్రభుత్వమే సమగ్ర విచారణ చేయాలన్న ప్రజల డిమాండ్**

సామాన్య ప్రజలు, ఆరోగ్య నిపుణులు కోరుతున్నది ఒక్కటే "ఫార్మా ఇన్స్పెక్షన్ వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా మార్చాలి." ఇన్స్పెక్టర్ల రాండమ్ అల్లోకేషన్,సర్ప్రైజ్ రైడ్స్, వీడియో రికార్డ్ ఆధారిత పరిశీలనలు, ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఇలాంటి పద్ధతులు అవసరమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రజారోగ్యం ప్రమాదంలో పడనీయకుండా తనిఖీల వ్యవస్థను శుభ్రం చేయాల్సిన సమయం ఇదే హైదరాబాద్ ఫార్మా రంగం ప్రపంచంలో భారతదేశాన్ని ప్రతినిధ్యం చేస్తోంది. ఇలాంటి సందర్భంలో ఇన్స్పెక్షన్లలో రాజీలు జరిగాయన్న అనుమానం కూడా పరిశ్రమ మంచిపేరు మీద నలుపు గీత వేస్తుంది. ఈ ఆరోపణలపై బాధ్యతాయుతమైన విచారణ, పారదర్శక చర్య అవసరం అని నిపుణులు సూచిస్తున్నారు. చూడాలి ఎలాంటి చర్యలు తీసుకుంటారో.

## బొమ్మ వెంకన్న సేవలు చిరస్మరణీయమని మున్నూరు కాపు సంఘం



**కరీంనగర్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ నేతృత్వంలో బొమ్మకల్‌లోని మున్నూరు కాపు వసతి గృహంలో మాజీ శాసనసభ్యులు, మున్నూరు కాపు ముద్దుబిడ్డ స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చల్ల హరిశంకర్ మాట్లాడుతూ, “తెలంగాణలో మున్నూరు కాపులను ఒకతాటిపైకి తీసుకురావడంలో బొమ్మ వెంకన్న గారి పాత్ర అపూర్వం. ఆయన సేవలు మర్చిపోలేనివి. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మున్నూరు కాపుల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమైనది” అని పేర్కొన్నారు. బొమ్మ వెంకన్నను పేదల పెన్నిధిగా, ప్రజల మన్ననలు పొందిన ప్రజా నాయకుడిగా కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం ట్రస్టు చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్, హాస్టల్ ఇన్‌చార్జ్ ముప్పిడి బాలు, ట్రస్ట్ సభ్యులు, మున్నూరు కాపు పెద్దలు, కుల బాంధవులు పాల్గొన్నారు. ఈ జయంతి వేడుకలు మున్నూరు కాపు సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి.

## అపోలో డయాగ్నొస్టిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు



**కరీంనగర్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో అపోలో డయాగ్నొస్టిక్ మంకమ్మతోట శాఖ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ప్రొప్రైటర్ బుర్ర తిలన్ గౌడ్ మాట్లాడుతూ, అయ్యప్ప స్వాముల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని షుగర్, కొలెస్ట్రాల్, థైరాయిడ్, కిడ్నీ సంబంధిత పరీక్షలు ఉచితంగా నిర్వహించామని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎన్నం ప్రకాష్, పర్వతం మల్లేశం, గోంటి లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యనారాయణ, మాదాసు సంజీవ్, యశ్వద రమణ చారి, దూనపాటి సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమం భక్తుల నుంచి ప్రశంసలు అందుకుంది.

## శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో జిల్లాస్థాయి ఆటల పోటీలు ఘనంగా



**కరీంనగర్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీలు కరీంనగర్ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ పోటీలను తెలంగాణ ప్రాంత పాలకమండలి సభ్యులు ఎలగందుల సత్యనారాయణ ప్రారంభించారు. పోటీల్లో కబడ్డీ, షటిల్, చెస్, క్యారమ్, ఖోఖో, వాలీబాల్, పరుగు పందెంలు, లాంగ్ జంప్, హై జంప్, డిస్క్, షాట్‌పుట్ వంటి విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి మాట్లాడుతూ, ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. విజేతలకు ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, మేచినేని దేవేందర్ రావు, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, గోలి పూర్ణచందర్, కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకులా దేవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తులో ప్రతిభావంతులుగా ఎదగడానికి బలమైన పునాది వేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఇందుర్తి మాజీ శాసన సభ్యులు బొమ్మ వెంకన్న జయంతి ఘనంగా నిర్వహణ



**హుస్నాబాద్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇందుర్తి మాజీ శాసన సభ్యులు, మున్నూరు కాపు సమాజానికి గౌరవనీయ నాయకుడు బొమ్మ వెంకన్న జయంతిని పురస్కరించుకొని హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని నాగారం చౌరస్తాలో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నేను విద్యార్థి దశలో ఉన్నప్పుడు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానేత బొమ్మ వెంకన్న. హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి, గౌరవెల్లి ప్రాజెక్ట్ సాధనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయం అని పేర్కొన్నారు. అనేక సందర్భాల్లో తనకు మార్గదర్శిగా నిలిచిన బొమ్మ వెంకన్న జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ, ఈ ప్రాంత అభివృద్ధికి, రైతాంగానికి అండగా నిలవాలని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డిసిసీ ప్రధాన కార్యదర్శి చిత్తారి రవీందర్, మాజీ కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, భూక్య సరోజన, నాయకులు అక్కు శ్రీనివాస్, పున్నసది, వెల్దండి వెంకటరమణ, బూరుగు కిష్ట స్వామి, గంపల శ్రీనివాస్, పూదరి శ్రీనివాస్, బిక్యా నాయక్, గట్టు రాములు, ఎండి హసన్, మైదం శెట్టి వీరన్న, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ జయంతి వేడుకలు బొమ్మ వెంకన్న సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించాలనే సంకల్పంతో సాగాయి.

## ఘనంగా పిల్లి సుధాకర్ జన్మదిన వేడుకలు

- మాల మహానాడు ఆధ్వర్యంలో



**హుస్నాబాద్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ జన్మదిన వేడుకలు హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. మాల జాతి హక్కుల పరిరక్షకుడిగా, దళితుల సమస్యలపై చరిత్రలో నిలిచిపోయే పోరాటాలు నిర్వహించిన నాయకుడిగా పిల్లి సుధాకర్ గారు ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలిచారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వేడుకలు జాతీయ మాల మహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆరె కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నాయకులు పిల్లి సుధాకర్ గారికి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్ పీఎస్ జాతీయ నాయకులు గుగ్గిళ్ళ పిరయ్య గారిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ వేడుకలో మాల మహానాడు జిల్లా నాయకులు ఉసిల్ల ఉదయ్, సైదాపూర్ మండల నాయకులు వేరంగి సాయిపరమేశ్వర్, హుస్నాబాద్ మండల నాయకులు వెన్న శ్రీరామ్, రాజు తదితర కుల బాంధవులు పాల్గొన్నారు. ఈ వేడుకలు మాల సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి.

## మంగంపల్లిలో తొలి ఓటుతో ఎన్నికలకు శుభారంభం చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు




**పెద్దమందడి వనపర్తి డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
తెలంగాణ గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు తమ ఓటు హక్కును ఉదయం తొలి గంటలోనే మంగంపల్లి గ్రామంలో వినియోగించారు,సొంత గ్రామంలో ప్రజల మధ్య నిలబడి ఓటు వేయడం ఆనందంగా ఉందని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన ప్రాథమిక హక్కు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఓటరు సమయం ముగిసేలోపు ప్రశాంతంగా తమ ఓటును వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా పాలనలో భాగస్వామ్యమవ్వడం కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించడం బాధ్యత అన్నారు.

## గుర్రాంపల్లి అభివృద్ధి లక్ష్యంగా తొగరి సంపత్ ప్రచారం




**పెద్దపల్లి, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుర్రాంపల్లి గ్రామ సర్పంచ్ బరిలో తొగరి సంపత్ నిలిచారు. కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు. తొగరి సంపత్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు. మెయిన్ రోడ్డు నుండి ఐకెపి సెంటర్, స్మశాన వాటిక వరకు బీటీ రోడ్డు నిర్మాణం, పెద్దమ్మగుడి, హమాలి కమ్యూనిటీ హాలు, పూర్తికాని నల్ల కలెక్షన్ల విస్తరణ, బొక్కలగుంట వద్ద కల్వర్టు నిర్మాణం, రోడ్డు డ్రైనేజీ పనులు చేపడతానని తెలిపారు. పాడి పశువులకు పశువైద్య సేవలు, తాగునీరు సాగునీరు, నూతన గృహాలు, విద్యుత్ సౌకర్యాలు, రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేలా చూస్తానని, గ్రామపంచాయతీ నిధులను విద్య, వైద్యానికి వినియోగిస్తానని4 తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వంటి అంశాలను అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సేవే తన లక్ష్యమని, గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తొగరి సంపత్ విజ్ఞప్తి చేశారు.

## గౌడ సహకార సంఘం కొత్త అధ్యక్షుడిగా సురేష్ గౌడ్



**పెద్దపల్లి, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి గౌడ పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా భూషణవేన సురేష్ గౌడ్‌ను సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తిర్రి సుధాకర్ గౌడ్, డైరెక్టర్లుగా రేగుంట రమేష్, భూషణవేన రాజయ్య, తిర్రి రఘు, బబ్బిలి శంకరయ్య, కాయల శ్రీనివాస్, కెక్కెర్ల రవి, రేగుంట సురేష్ గౌడ్, భూషణవేన వేణు, రేగుంట ప్రభాకర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని సంఘ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేష్ గౌడ్ మాట్లాడుతూ, తమ ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేసి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వెంకటరావుపల్లి గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం



**పెద్దపల్లి, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూలపల్లి మండలంలోని వెంకటరావుపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయలేదని, ప్రజలు మళ్లీ మోసపోకుండా బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఓటు అడగడానికి వచ్చినప్పుడు, మాకు బాకీ ఉన్న డబ్బులు ఇవ్వగలరా అని ప్రశ్నించండి అని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి తమ ప్రభుత్వంలోనే జరిగిందని గుర్తుచేశారు. ప్రజలు వాస్తవాలు గుర్తించి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మచ్చ అరుణ యాదగిరిని గెలిపిస్తే మాత్రమే గ్రామం తిరిగి అభివృద్ధి దిశలో నడుస్తుంది అని ఆయన అన్నారు. మచ్చ అరుణ యాదగిరి కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని దాసరి మనోహర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువరన్ సింగ్, మాజీ సర్పంచ్, మాజీ వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# సేవకులే నాయకులవుతారు

**- దారం శ్రీనివాసరెడ్డి**



**కరీంనగర్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ఎన్జీవోల సంఘానికి అనుబంధంగా ఉన్న సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అకుల జీవన్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల సంఘ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా టీఎన్జీవో సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, సేవకులే నాయకులు అవుతారు. నాయకుడి కోసం ఎదురు చూడవలసిన పనీ లేదు. బాధ్యత తీసుకుని పని చేస్తే వారే నాయకులవుతారు అని పేర్కొన్నారు. అకుల జీవన్‌తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి సత్యనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పోరండ్ల రాకేష్, కల్వకుంట్ల జగదీష్ కుమార్‌లను కూడా సత్కరించారు. భూపరిమాణం, భూ పత్రాల సంరక్షణ, రెవెన్యూ పునర్విభజన వంటి కీలక రంగాల్లో ఈ విభాగం ప్రభుత్వానికి బలంగా నిలుస్తోందని, ఉద్యోగుల ఐక్యత, సమస్యల పరిష్కారం, సేవల ప్రమాణాల పెంపు కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తికావడానికి సహకరించిన రాష్ట్ర ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కార్యదర్శి ముజీబ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, జీవన్ రెడ్డి, బరిగేల శ్రీనివాస్, మాడిశెట్టి ఫణి సంతోష్ కుమార్, కుర్ర మధు, సంపత్, కరుణాకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

**- దాసరి మనోహర్ రెడ్డి**



**పెద్దపల్లి, డిసెంబర్ 11( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
పెద్దపల్లి నియోజకవర్గంలోని జూలపల్లి మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వెంకట్రావుపల్లి, కుమ్మరి కుంట గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ హామీలు ఇవ్వడంలో ముందుండి, వాటిని అమలు చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా ప్రజలను మోసం చేస్తూ, మాటలతో మభ్యపెడుతూ పాలన సాగించిందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఓటమి భయంతో ఆలస్యం చేశారని విమర్శించారు. గ్రామాభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం బలమైన నాయకత్వం ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. మహిళలకు నెలకు 2500, వృద్ధులకు 4000, వికలాంగులకు 6000 పెన్షన్ ఇస్తామన్న హామీలు అమలుకాలేదని, కల్యాణలక్ష్మికి తులం బంగారం మాట గాలికొదిలినట్టు అయిందన్నారు. గత రెండేళ్లుగా మహిళలకు 60,000, పెన్షనర్లకు 48,000, వికలాంగులకు 48,000 బాకీగా ఉందని గుర్తు చేశారు. ఓటు అడగడానికి వచ్చే కాంగ్రెస్ అభ్యర్థులను "మాకు బాకీ డబ్బులు ఇవ్వగలరా" అని ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. ఈ ప్రచార సభకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, మల్లేశం, ప్రసాద్, కొమ్మ సతీష్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అవహేళన వ్యాఖ్యలు

**- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి-నందిమల్ల అశోక్**



**వనపర్తి,డిసెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజాస్వామ్య విలువలను అవమానించే విధంగా ఎం.ఎల్.ఏ మాట్లాడటం హాస్యాస్పదమని, అసహనానికి నిదర్శనమని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మండిపడ్డారు.
ఎం.ఎల్.ఏకి స్థానిక సంస్థలపై అవగాహన లేకుండా కేంద్ర నిధుల పేరుతో తప్పుదారి పట్టించే వాఖ్యలు చేయడం తగదని ఆయన విమర్శించారు. బి.ఆర్.ఎస్ శ్రేణులు పార్టీ సైనికులుగా, ఆత్మాభిమానంతో నిలవడాన్ని జీర్ణించుకోలేక ఎం.ఎల్.ఏదూషణలకు దిగడం ప్రజాస్వామ్య అవమానమని అశోక్ వ్యాఖ్యానించారు.
"మీ పదవి ఇంక రెండేండ్లు మాత్రమే. వన్ టైమ్ సెటిల్మెంట్‌గా భావించి మసులుకోండి" అని ఎం.ఎల్.ఏకి ఆయన హితవు పలికారు.
నియోజకవర్గ వ్యాప్తంగా 3,250 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, 6,47,479 రేషన్ కార్డులు ప్రభుత్వం అందించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అవగాహనతో మాట్లాడితే మంచిదన్నారు.
బి.ఆర్.ఎస్ కార్యకర్తలను బెదిరించేలా "నా గేటు కూడా తొక్కనీయను" అని ఎం.ఎల్.ఏ చేసిన వ్యాఖ్య నియంతత్వం, అజ్ఞానం తప్ప మరేదీ కాదని అశోక్ తీవ్రంగా ఖండించారు.
"రెండేళ్ల పాలనలో ప్రజలకు ఏమి చేయలేకపోయారు ఇక చేస్తారన్న నమ్మకమూ లేదు" అని అశోక్ స్పష్టం చేశారు.
బి.ఆర్.ఎస్ శ్రేణులు ఆత్మగౌరవం కలిగినవారని, ఎవరినీ భయపడరు, ప్రజలు బి.ఆర్.ఎస్‌కు అండగా నిలవడం ఖాయమని చెప్పారు.
ఈ సమావేశంలో ప్రేమ్ నాథ్ రెడ్డి, సూర్యవంశం గిరి, ఇమ్రాన్, మంద రాము, సూర్యవంశం మునికుమార్, శిరీవాటి శంకర్, అలీమ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 21న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి




**పెద్దపల్లి డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల సూచించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తొలుత 13న జరగాల్సిన అదాలత్‌ను 21కి మార్చినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, బ్యాంకు రికవరీ, మోటార్ వెహికిల్ ఇన్సూరెన్స్ క్లెయిమ్, కుటుంబ తగాదాలు వంటి వివిధ కేసులు సామరస్య పద్ధతిలో పరిష్కరించుకునే అవకాశం ఉందని చెప్పారు. కోర్టు వెలుపల రాజీ ద్వారా కేసులు ముగించుకోవడం వల్ల అప్పీల్, రివిజన్ అవసరం లేకుండా మానసిక ప్రశాంతత లభిస్తుందని వివరించారు. అదాలత్ విజయవంతం కావడానికి న్యాయ సేవాధికార సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని కార్యదర్శి భవాని తెలిపారు. కోర్టు పరిధిలో లేని వారు కూడా వాట్సాప్ కాల్ ద్వారా అంగీకారం తెలుపి కేసులు ముగించుకునే అవకాశం ఉందని చెప్పారు. న్యాయవాదిని పెట్టలేని వారు అర్హత ఉంటే ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. ఈ సందర్భంగా సునీత కుంచాల, భవాని, అదనపు న్యాయమూర్తి కుంచం స్వప్న రాణి, జూనియర్ సివిల్ జడ్జి మంజులతో కలిసి లోక్ అదాలత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# ప్రచారంలో దూసుకెళ్తున్న కాంగ్రెస్



**అమరాబాద్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమరాబాద్ మండలంలోని జంగారెడ్డిపల్లి, మాధవానిపల్లి, తుర్కపల్లి, తిరుమలాపురం, మన్ననూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పర్యటించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ, జంగారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న వడ్యావత్ రజిత, హనుమంతును పరిచయం చేశారు. అభివృద్ధిని ఇంటి దాకా తీసుకురావాలంటే బలమైన తోడు అవసరమని, అందుకోసం కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్ అనురాధ ఆశీస్సులతో ప్రచారం ఉత్సాహంగా సాగింది.

# అచ్చంపేటలో పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ కమిటీ ఎన్నికలు



**అచ్చంపేట, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరం (హెబ్రోను)లో పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ కమిటీ ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గానికి చెందిన 63 మంది పాస్టర్లు, క్రైస్తవ పెద్దల సమక్షంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ రెవరెండ్ ఆశీర్వాదం, అధ్యక్షులుగా పి. జాన్ పాల్, జనరల్ సెక్రటరీగా యస్.పి. ఫెర్రి రాయ్, కోశాధికారిగా యం. ఆనంద్, ఉపాధ్యక్షులుగా పి. క్రిస్టఫర్, జాయింట్ సెక్రటరీగా యం. అబ్రహం, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బయన్న, రాజరత్నం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన పాస్టర్లు, నాయకులు మల్లేష్, మీసాల సుధాకర్, బొంత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్‌లో బీజేపీ వార్డు సభ్యులు ఏకగ్రీవం





**అమ్రాబాద్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండల కేంద్రంలో బీజేపీ బలపరిచిన నలుగురు వార్డ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిగుర్ల నాగమ్మ, ఎలిజాల శిరీష, రాట్లావత్ మహేష్ నాయక్, టేకులపల్లి రజిత యాదవ్‌లకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీధర్, అమ్రాబాద్ కార్యదర్శి మల్లేష్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు నోముల శంకర్ గౌడ్, జబ్బు కృష్ణ యాదవ్, నోముల పరమేష్ గౌడ్, బాలరాజు, నోముల మోహన్ గౌడ్, టేకులపల్లి మల్లేష్ యాదవ్, సురకారపు భరత్ గౌడ్, ఎడమ పెద్దిరాజు యాదవ్, కుంభం అరుణ్ గౌడ్, బోడ అక్షయ్ తదితరులు పాల్గొని విజయోత్సాహాన్ని నింపారు.

## ఎల్లమ్మ గూడెం సర్పంచ్ గా వాణి సందీప్ రెడ్డి

**తిప్పర్తి,డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఊట్కూరి వాణి సందీప్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఆమె తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ బలపరిచిన మామిడి నాగలక్ష్మిపై 459 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ ఘన విజయంతో సర్పంచ్ మద్దతుదారులు గ్రామంలో బాణసంచా కాల్చి, డప్పుల మోతతో సంబరాలు నిర్వహించారు.

## గౌరవెల్లి ప్రాజెక్టుకు బొమ్మ వెంకన్న పేరు పెట్టాలి




**హుస్నాబాద్ డిసెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డులో బొమ్మ వెంకన్న విగ్రహం వద్ద ఆయన జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు బీజం పడింది బొమ్మ వెంకన్న కృషివల్లేనని కాంగ్రెస్ నేతలు గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రాజెక్టుకు ఆయన పేరును పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా లైబ్రరీ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, డిసిసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, ఎండి హసన్, వడ్డేపల్లి వెంకటరమణ, మైదామిశెట్టి వీరన్న, పున్నాసది, వల్లపు రాజు, పచ్చిమట్ల రాధా, భూక్య సరోజన, లక్ష్మి నాని, రజిత, కోమటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వెల్దండ సర్పంచ్‌గా కాంగ్రెస్ అభ్యర్థి మట్ట యాదమ్మ ఘనవిజయం





**వెల్దండ, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ ఘనవిజయం సాధించారు. ఆమెకు 1249 మెజార్టీ లభించగా, ఈ విజయాన్ని ప్రజల అందరి విజయమని మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ పేర్కొన్నారు.సర్పంచ్‌గా గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న



ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని మట్ట యాదమ్మ హామీ ఇచ్చారు. ప్రజల నాడిని తెలుసుకొని ముందే ఫలితాలను ఊహించిన నీలగిరి ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ విజయోత్సవ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, వివిధ వార్డు సభ్యులు, నాయకులు, అభిమానులు పాల్గొని ఉత్సాహాన్ని నింపారు.

# వెనిజులా తీరంలో ఆగని అమెరికా ఆగడాలు

**ఆయిల్ ట్యాంకర్ స్వాధీనం**
**ఇది సముద్ర దొంగతనమే : కారకాస్ ఆగ్రహం**




**కారకాస్ డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డోనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం వెనిజులాపై కయ్యానికి కాలు దువ్వుతోంది. తాజాగా వెనిజులా తీరంలో ఓ ఆయిల్ ట్యాంకర్‌పై దాడి చేసి దానిని స్వాధీనం చేసుకుంది. అధ్యక్ష భవనంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ 'మేము ఇప్పుడే వెనిజులా తీరంలో ఒక ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నాము. అది చాలా పెద్ద ట్యాంకర్. ఇప్పటి వరకూ మేము స్వాధీనం చేసుకున్న ట్యాంకర్లలో ఇదే అత్యంత పెద్దది' అని చెప్పారు. కాగా ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న దృశ్యాలతో ఉన్న వీడియోను అటార్నీ జనరల్ పామ్ బాండీ విడుదల చేశారు. ఆంక్షలను ఎదుర్కొం టున్న ట్యాంకర్ వెనిజులా నుంచి ఇరాన్‌కు ముడి చమురును రవాణా చేస్తోందని తెలిపారు. ఎఫ్‌బీఐ, రక్షణ శాఖ, హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం, అమెరికా తీరగస్తీ దళం సంయుక్తంగా ఈ దాడి నిర్వహించాయని వివరించారు. 'వెనిజులా ఆయిల్ ట్యాంకర్ విదేశీ ఉగ్రవాద సంస్థలకు మద్దతుగా అక్రమంగా చమురును రవాణా చేస్తోంది. ఈ ట్యాంకర్‌పై అమెరికా అనేక సంవత్సరాలుగా నిషేధం విధిస్తోంది' అని చెప్పారు. ట్యాంకర్‌లోని చమురును ఏం చేస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానమిస్తూ దానిని తమ వద్దే ఉంచుకుంటామని చెప్పారు. ఈ ట్యాంకర్ రెండు రోజుల క్రితం గయానా పతాకంతో ప్రయాణించిందని బీబీసీ తెలిపింది. అయితే అది తమ దేశంలో రిజిస్టర్ అయిన నౌక కాదని గయానా స్పష్టం చేసింది.

**దాడి జరిగిందిలా**

బాండీ విడుదల చేసిన వీడియో ఫుటేజ్ ప్రకారం అమెరికా సైనిక హెలికాప్టర్ ఓ పెద్ద నౌక పైన చక్కర్లు కొట్టింది. అందులోని సైనికులు తాళ్ల సాయంతో నౌకపై దిగారు. వారు తుపాకులు పట్టుకొని నౌకలో తిరిగారు. యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఫోర్డ్ నుంచి హెలికాప్టర్ బయలుదేరిందని సీనియర్ సైనికాధికారి ఒకరు తెలిపారు. ఈ వాహక నౌకను గత నెలలోనే అమెరికా ప్రభుత్వం కరేబియన్‌లో మోహరించింది. ఇందులో రెండు హెలికాప్టర్లు, పది మంది తీర గస్తీ సభ్యులు, పది మంది నౌకాదళ సభ్యులతో పాటు ప్రత్యేక దళాలు కూడా ఉంటాయి. కాగా ఇలాంటి మరిన్ని దాడులకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధపడుతున్నదని సమాచారం.

# రక్షణ బిల్లులో చైనాపై మరిన్ని ఆంక్షలు

## అమెరికా కాంగ్రెస్ ఆమోదం




**వాషింగ్టన్ డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రక్షణ బిల్లులో చైనాపై మరిన్ని ఆంక్షలు విధించేందు కు అమెరికా ప్రతినిధి సభ ఆమోదం తెలిపింది. అత్యంత కీలకమైన రంగాలలో చైనా పెట్టుబడులను ఈ బిల్లు నిరాకరిస్తోంది. చైనాకు చెందిన బయోటెక్నాలజీ కంపెనీలపై అమెరికా ఆధారపడడాన్న తగ్గిస్తోంది. చైనా సైనిక శక్తిని బలోపేతం చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన అమెరికా పెట్టుబడులను తనిఖీ చేసే నిబంధనను కూడా బిల్లులో చేర్చారు. మూడు వేల పేజీలతో కూడిన ఈ బిల్లును అమెరికా కాంగ్రెస్ బుధవారం ఆమోదించింది. ఇప్పుడది సెనెట్ ముందుకు వెళ్లనుంది. బ్లాక్‌లిస్టులో పెట్టిన చైనా బయోటెక్నాలజీ కంపెనీల నుంచి సేవలు, పరికరాల కొనుగోలు కోసం ప్రభుత్వ సొమ్మును వినియోగించడాన్ని ఈ బిల్లు నిషేధిస్తోంది. అంతేకాక తైవాన్‌కు భద్రతా పరమైన సహకారం కోసం కాంగ్రెస్ ఆమోదించిన రక్షణ బిల్లు ఈ సంవత్సరం కేటాయింపులను బిలియన్ డాలర్ల నుంచి 300 మిలియన్ డాలర్లకు పెంచింది. తైవాన్‌లో సంయుక్త డ్రోన్, యాంటీ-డ్రోన్ కార్యక్రమం చేపట్టడానికి రక్షణ శాఖకు అనుమతి ఇచ్చింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలో చేరడానికి తైవాన్ చేస్తున్న ప్రయత్నాలకు కూడా బిల్లులోని నిబంధనలు మద్దతు ఇచ్చాయి. ఇదిలా వుండగా తైవాన్‌కు మరింత మద్దతు అందించేందుకు అమెరికా నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ చట్టం వీలు కల్పిస్తోంది. చైనా కమ్యూనిస్టు పార్టీని ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న తీవ్రమైన, వ్యూహాత్మక వైఖరికి ఈ చర్యలు అద్దం పడుతున్నాయని హౌస్ సెలక్ట్ కమిటీలోని డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు రాజా కృష్ణమూర్తి చెప్పారు. అమెరికా అధ్యక్ష భవనం ఇటీవలి కాలంలో చైనా విషయంలో కొంత మెతక వైఖరి ప్రదర్శిస్తోంది. చైనాతో అమెరికా ఆర్థిక సంబంధాలను తిరిగి సమతుల్యం చేసుకుంటామని ట్రంప్ ప్రభుత్వం ఇటీవల చెప్పింది. చైనాకు అత్యాధునిక కంప్యూటర్ చిప్‌ను విక్రయించేందుకు అధ్యక్ష భవనం ఈ వారంలోనే న్విడియా కంపెనీని అనుమతించింది. అయితే అమెరికా ప్రతినిధి సభ మాత్రం చైనా పట్ల కఠినంగా వ్యవహరించడం గమనార్హం.

**మండిపడిన చైనా**

కాంగ్రెస్ ఆమోదించిన బిల్లును వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం తప్పుపట్టింది. 'చైనా ముప్పుపై పదే పదే అసత్య కథనాలను ప్రచారం చేస్తూ తైవాన్‌కు సైనిక మద్దతు ఇవ్వాలని ఈ బిల్లు కోరుతోంది. చైనా ఆర్థికాభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ద్వైపాక్షిక వాణిజ్య, ఆర్థిక సంబంధాలను పరిమితం చేస్తున్నారు. ఇది చైనా సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలను దెబ్బతీస్తుంది. ద్వైపాక్షిక సంబంధాలను స్థిరీకరించడానికి ఇరు పక్షాలు చేస్తున్న ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తోంది' అని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి లియు పెంగ్యూ అన్నారు.

# లింగాలగూడెం గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన కదిరె సైదులు



**నల్లగొండ ,డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** కనగల్ మండలం లింగాలగూడెం గ్రామ సర్పంచ్ గా కదిరె సైదులు 38 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు మొత్తం 8 వార్డులకు గాను కాంగ్రెస్ 5 టిఆర్ఎస్ 3 వార్డులను గెలుచుకున్నారు ఉపసర్పంచ్ గా గండిబోయిన శంకరును ఎంపిక చేశారు తమపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు ప్రతినిత్యం ప్రజాసేవలో ఉంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానని ఈ గెలుపు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు ఈ కార్యక్రమంలో కదిరె సైదులు మహేష్ సైదులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ఆర్థిక సాయం



**కడ్తాల్, డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి గ్రామపంచాయతీ కి చెందిన ఈర్లపల్లి రాములు బుధవారం సాయంత్రం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి రాములు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాములు మృతదేహానికి పూలమాలేసి నివాళులర్పించారు. తదుపరి రాములు కుటుంబ సభ్యులకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు ముదివెన్ గ్రామానికి చెందిన కొంక సాయి కృష్ణ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. వారి పార్థవ దేహానికి పూల మాలేసి నివాళులర్పించి వారి కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వీరయ్య, నాయకులు పొట్టి శీను,రాజు ,ముత్యాలు, బిక్షపతి,పర్వతాలు, రాఘవరెడ్డి,వినోద్,జంగయ్య, గోపాల్ మహేష్ యాదవ్ సతీష్ రెడ్డి,శంకర్,జాంగిర్, శివ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరాలి




**అమ్రాబాద్, డిసెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అమ్రాబాద్ మండల బి.కే. తీర్మలాపూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఘనసన్మానం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరాలని ఆయన ఆకాంక్షించారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపిటిసి చిక్కుడు కేశవులు, సింగిల్ విండో డైరెక్టర్ రామయ్య, సీనియర్ నాయకులు హనుమంతు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఉత్సాహాన్ని నింపారు.

## 5 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతానికి సర్ డెడ్‌లైన్ పొడిగింపు




**న్యూఢిల్లీ డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : ఓటర్ల జాబితా సవరణ కోసం సర్ ప్రక్రియను చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే 5 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సిర్ ప్రక్రియ డెడ్‌లైన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, యూపీ, అండమాన్ నికోబార్ కోసం కొత్త సిర్ షెడ్యూల్‌ను రిలీజ్ చేసింది. ఆయా రాష్ట్రాలకు చెందిన ఎన్నికల సంఘం సీఈవోలు అభ్యర్థన చేసిన నేపథ్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కోసం గడువు తేదీని పొడిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఇవాళ ఆదేశాలు ఇచ్చింది. అయితే గోవా, లక్షద్వీప్, రాజస్థాన్, బెంగాల్‌కు మాత్రం ఎన్నికల సంఘం ఎటువంటి పొడిగింపు ఇవ్వలేదు.డిసెంబర్ 16వ తేదీన ఈ నాలుగు రాష్ట్రాలకు చెందిన ఓటర్ల జాబితాను పబ్లిష్ చేయనున్నారు. కొత్త డెడ్‌లైన్ ప్రకారం తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో డిసెంబర్ 14వ తేదీ, మధ్యప్రదేశ్.. చత్తీస్‌ఘడ్, అండమాన్ నికోబార్‌లో డిసెంబర్ 18వ తేదీ, యూపీలో డిసెంబర్ 26వ తేదీ వరకు సర్ ప్రక్రియ జరనున్నది. డిసెంబర్ 19వ తేదీన తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల జాబితాను, డిసెంబర్ 23వ తేదీన మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, అండమాన్ నికోబార్, డిసెంబర్ 31వ తేదీన యూపీ ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

## భారత జలాల్లోకి పాక్ బోటు.. స్వాధీనం చేసుకున్న కోస్ట్ గార్డ్




**అహ్మదాబాద్: డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** పాకిస్థాన్‌కు చెందిన బోటు భారత జలాల్లోకి ప్రవేశించింది. దీంతో కోస్ట్ గార్డ్ రంగంలోకి దిగింది. షిప్ ద్వారా అడ్డుకున్నది. పాక్ బోటును స్వాధీనం చేసుకున్నది. అందులో ఉన్న 11 మందిని అదుపులోకి తీసుకున్నది. గుజరాత్ తీరంలోని సముద్ర జలాల్లో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 10న పాకిస్థాన్‌కు చెందిన మత్స్యకారుల పడవ భారత సముద్ర జలాల్లోకి ప్రవేశించింది. భారత తీర రక్షక దళం (ఐసీజీ) దీని గుర్తించింది. కోస్ట్ గార్డ్ సిబ్బంది ఒక నౌకలో అక్కడకు చేరుకున్నారు. పాక్ బోటును అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న 11 మంది పాక్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు కోసం జఖావ్ మెరైన్ పోలీసులకు వారిని అప్పగించినట్లు గుజరాత్ రక్షణ శాఖ పీఆర్వో వింగ్ కమాండర్ అభిషేక్ కుమార్ తివారీ తెలిపారు.కాగా, ఇండియన్ కోస్ట్ గార్డ్ కూడా దీనిని ధృవీకరించింది. అచంచలమైన అప్రమత్త, సముద్ర సరిహద్దులను రక్షించడానికి, అంతర్జాతీయ సముద్ర చట్టం పర్యవేక్షణలో భారత్ దృఢ సంకల్పాన్ని తమ చర్య ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొంది. అవిశ్రాంత నిఘా, చురుకైన ఆపరేషన్ సముద్ర భద్రతా వ్యూహానికి పునాది అని వెల్లడించింది.

## అఫ్ఘాన్‌పై పాక్ దాడులు యుద్ధ చర్యలే : భారత్




**న్యూఢిల్లీ -డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** అఫ్ఘానిస్థాన్ పై పాక్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులను యుద్ధ చర్యలుగా అభివర్ణించింది. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు, క్రికెటర్ల ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేసింది. ఇటువంటి దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని మండిపడింది. ఈ మేరకు తాలిబన్ పాలిత అఫ్ఘానిస్థాన్‌కు పూర్తి మద్దతు ప్రకటించింది.యూఎన్ భద్రతా మండలి సమావేశంలో భారత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను భారత్ గౌరవిస్తుందని తెలిపారు. అమాయక ప్రజల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. చాలా ఏళ్లుగా బలహీన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న అఫ్ఘాన్ ప్రజల పై దాడులు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న దేశంపై బహిరంగ బెదిరింపులు, యుద్ధ చర్యలు యూఎన్ చార్టర్, అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. వాణిజ్య, రవాణా మార్గాలను మూసివేయడం ట్రేడ్ అండ్ ట్రాన్సిట్ టెర్రరిజం అని ధ్వజమెత్తారు. ఈ మేరకు అఫ్ఘాన్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు.

## భారత్‌కు సేవ చేసేందుకు ఎదురుచూస్తున్న




**న్యూఢిల్లీ డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ భారత్‌లో అడుగుపెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. త్వరలోనే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించనున్నది. ఈ మేరకు ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్ ఊహాగానాలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. కొద్దిరోజుల్లోనే సేవలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన సంకేతాలను పంపారు. సోషల్ మీడియా వేదికగా కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియా చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ.. 'స్టార్‌లింక్'తో భారత్‌కు సేవ చేసేందుకు ఎదురుచూస్తున్నాను' అని స్పందించారు. కేంద్ర ప్రభుత్వంతో స్టార్‌లింక్ బృందం చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్నది.స్టార్‌లింక్‌కు చివరి దశ అనుమతి రావాల్సి ఉన్నది. ఇదిలా ఉండగా.. ఇటీవల కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో స్టార్‌లింక్ వైస్ ప్రెసిడెంట్ లారెన్ డ్రేయర్ ఇటీవల ఢిల్లీలో భేటీ అయ్యారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు శాటిలైట్ ఆధారిత కనెక్టివిటీని విస్తరించడం ప్రయత్నంలో భాగంగా చర్చలు జరిపినట్లుగా సింధియా చెప్పారు. సంప్రదాయ నెట్‌వర్క్ అందుబాటులో లేని చోట్ల శాటిలైట్ ఇంటర్నెట్ కీలకం కానుందన్నారు. దేశవ్యాప్తంగా హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని లారెన్ డ్రేయర్ తెలిపారు. అయితే, గ్రామీణ ప్రాంతాలకే స్టార్‌లింక్ సేవలు పరిమితమవుతాయని మస్క్ స్పష్టం చేశారు. కనెక్టివి లేని, ఖరీదైన, నమ్మకం లేని బ్రాడ్‌బ్యాండ్ ఉన్న ప్రాంతాల్లోని వారిని దృష్టిలో పెట్టుకొని రూపొందించినట్లు పేర్కొన్నారు. పరిమితుల కారణంగా జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్టార్‌లింక్ సేవలు అందించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇటీవల సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరలు వెబ్‌సైట్‌లో వైరల్ అయ్యాయి. రెసిడెన్షియల్ యూజర్స్‌కు నెలకు రూ.8600, హార్డ్‌వేర్ కిట్‌కు అదనంగా రూ.34 వేలు చెల్లించాల్సి ఉంటుందని.. ఈ ప్యాకేజీలో శాటిలైట్ డిష్, వైఫై రౌటర్, మౌంటింగ్ స్టాండ్, పవర్ అడాప్టర్, కేబుల్స్‌తో కూడిన ప్లగ్ అండ్ ప్లే కిట్‌ను కస్టమర్లకు ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే, ఈ ధరలపై స్టార్‌లింక్ స్పందించింది. సాంకేతిక లోపం వల్లే అలా జరిగిందని.. ఆ ధరలు వాస్తవమైనవి కావని కంపెనీ స్పష్టం చేసింది. స్టార్‌లింక్ ఇండియా వెబ్‌సైట్ ఇంకా అధికారికంగా లాంచ్ చేయలేదని.. కస్టమర్ల నుంచి ఆర్డర్లు తీసుకోవడం లేదని స్పష్టం చేసింది.

## 2 కోట్ల మంది భారతీయులకు ఏఐపై నైపుణ్య శిక్షణ ఇస్తాం: సత్యా నాదెళ్ల




**బెంగుళూరు: డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. భారత్‌లోని కృత్రిమమేధ వ్యవస్థకు తగిన రీతిలో మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన తెలిపారు. క్లోడ్ కంప్యూటింగ్ వ్యవస్థను కూడా మైక్రోసాఫ్ట్ మరింత పటిష్టం చేసేందుకు పనిచేస్తున్నట్లు చెప్పారు. లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడం ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఉత్తమైన మౌళిక సదుపాయాల్ని కల్పించనున్నట్లు చెప్పారు.సుమారు 17.5 బిలియన్ల డాలర్ల పెట్టుబడి పెడుతున్నట్లు సత్యానాదెళ్ల తెలిపారు. ఆసియా ఖండంలోనే మైక్రోసాఫ్ట్‌కు చెందిన అత్యంత భారీ పెట్టుబడి ఇదేఅని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్లౌడ్ ప్లాట్‌ఫామ్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్ తెలిపారు. అజూర్ కంప్యూటర్ వ్యవస్థపై వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 70 కన్నా ఎక్కువ సంఖ్యలో డేటా సెంటర్లు ఉన్నాయన్నారు. భారత్‌లోనూ మైక్రోసాఫ్ట్ సెంటర్లు పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. గిట్‌హబ్ లో 2030 నాటికి ఇండియా నెంబర్ వన్‌గా మారుతుందని ఆయన అంచనా వేశారు. భారత్‌లో జియోతోనూ భాగస్వామ్యం ఉందన్నారు. 2026లో కొత్త డేటా సెంటర్ ప్రాంతం ఆపరేషనల్‌గా మారనున్నట్లు నాదెళ్ల చెప్పారు. దక్షిణమధ్య భారతంలో కొత్త డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోనున్నట్లు నాదెళ్ల పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సుమారు రెండు కోట్ల మంది భారతీయులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు నాదెళ్ల తెలిపారు. ప్రభుత్వానికి చెందిన ఈ-శ్రమ్ ప్రోగ్రామ్ ద్వారా అసంఘటిత కార్మికులను ఏఐతో చైతన్యపరచవచ్చు అన్నారు. భారత్‌లోని ప్రతి వ్యక్తిని, ప్రతి సంస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నాదెళ్ల పేర్కొన్నారు.


## సర్ పేరుతో ఓట్ చోరీ

**ఈసీ వైఖరి..పారదర్శకత, విశ్వసనీయతకే ముప్పు**
**మీరు చట్టాలను మార్చొచ్చు..**
**కానీ ప్రజల గొంతును అణచలేరు :**
**రాజ్యసభలో కేంద్రంపై ప్రతిపక్షాల విమర్శలు**



**న్యూఢిల్లీ డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో 'ఓట్ చోరీ'కి పాల్పడుతున్నారని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో పౌరుల ఓట్ల తొలగింపునకు తాము వ్యతిరేకమని, రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కుకు భంగం వాటిల్లితే తాము చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వైఖరి పారదర్శకత, విశ్వసనీయతకే ముప్పుగా మారిందని అన్నారు. గురువారం రాజ్యసభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ప్రతిపక్షనేతలు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుతెన్నులపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ అజరు మకెన్ మాట్లాడుతూ భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి అని మనం అంటున్నామని, కానీ ఈ రోజు దేశంలో ప్రజాస్వామ్యం సజీవంగా లేదనడానికి రుజువులు ఉన్నాయని అన్నారు. అన్ని పార్టీలకు సమాన అవకాశాలు, పారదర్శకత, విశ్వసనీయత వంటి మూడు అంశాలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని తెలిపారు. 2024 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారని, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తరువాత మాత్రమే వాటిని అనుమతించారని ఆయన పేర్కొన్నారు. అదే బీజేపీ బ్యాంక్ ఖాతాల జోలికి పోగలరా? అని ప్రశ్నించారు. హర్యానాలో ఎన్నికల సంఘం చేసిన వివిధ ప్రకటనలలో ఓటింగ్ శాతం స్థిరంగా లేదని అన్నారు. పారదర్శకతకు సంబంధించిన ఆందో ళనలను కూడా ఆయన వ్యక్తం చేశారు. ఎన్నికల బూత్‌ల సీసీటీవీ ఫుటేజ్‌లను ఇకపై యాక్సెస్ చేయలేని విధంగా సవరణను తీసుకువ చ్చారని ఆయన పేర్కొన్నారు. ఏ తప్పు జరగకపోతే, ఎన్నికల అధికారులను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నిం చారు. ప్రతిపక్షం మహిళలకు చెల్లింపులు చేయాలని ప్రయత్నిం చినప్పుడు, దానిని లంచంగా పరిగణించి మోడల్ ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తారని, కానీ అధికార పార్టీ అలా చేసినప్పుడు, ఎందుకు దాన్ని అమలు చేయటం లేదని ప్రశ్నించారు. మీరు చట్టాలను మార్చవచ్చు, కానీ ప్రజల గొంతును అణచివేయలేరని ఆయన అన్నారు. ఎన్నికల వ్యవస్థలో ఈవీఎంలు చాలా సమస్యలు సృష్టిస్తున్నాయని డీఎంకే ఎంపీ ఎన్ఆర్ ఎలాంగో అన్నారు. నేడు మన దగ్గర ఫూల్ ప్రూఫ్ ఎన్నికల వ్యవస్థ లేదని తెలిపారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన ఈవీఎం డిజైన్ పలు సమస్యలు కలిగిస్తోందని చెప్పారు. పారదర్శకత లేకపోవడం, సాంకేతిక సవాళ్లన్నీ ఈవీఎంలతో ఉత్పన్నమవు తున్నాయని వివరించారు. ఓటరు, కంట్రోల్ యూని ట్ మధ్య ప్రత్యక్ష ఇంటర్‌ఫేస్ లేదని ఆయన నొక్కి చెప్పారు. సింబల్ లోడింగ్ యూనిట్లలో ఏముందో ఎవరికీ తెలియదని అన్నారు. టీఎంసీ ఎంపీ డోలా సేన్ మాట్లాడుతూ ఎన్నికల సంస్కరణలను తాము వ్యతిరేకించడం లేదని, ఓటర్లను జాబితాలో నుంచి తొలగించేందుకు తయారు చేసే జాబితాలను తాము వ్యతిరేకి స్తున్నామని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటు చోరీ అంగీకరించబోమని, దేశ ప్రజల హక్కులను హరిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు.

## త్వరలో ప్రధాని మోదీతో ఇజ్రాయెల్ ప్రధాని భేటీ..!



**న్యూఢిల్లీ డిసెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు త్వరలో భారత పర్యటనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిజానికి నెతన్యాహు ఈనెలలోనే ఇండియాని విజిట్ చేయాల్సి ఉంది. చివరి నిమిషంలో ఆయన పర్యటన వాయిదా పడింది. అయితే, తాజాగా ప్రధాని మోదీ తో ఇజ్రాయెల్ ప్రధాని ఫోన్‌లో సంభాషించారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. అదే సమయంలో త్వరలో కలిసేందుకు ఇద్దరూ అంగీకారం తెలిపినట్లు ఇజ్రాయెల్ పీఎంవో సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. ఇద్దరి మధ్య స్నేహపూర్వక సంభాషణ జరిగినట్లు తెలిపింది. ఇద్దరు నేతలు త్వరలో కలవడానికి అంగీకరించినట్లు వెల్లడించింది. ఇందుకోసం తేదీని ఖరారు చేసేందుకు ఇజ్రాయెల్ అధికారులు భారత అధికారులతో ప్రస్తుతం సమన్వయం చేసుకుంటున్నట్లు పేర్కొంది.

# బిజినెస్

## బీఎండబ్ల్యూ కార్లు ప్రియం!




జైసల్మేర్, డిసెంబర్ 11

జర్మనీ లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ.. వాహన ధరలను మరోసారి పెంచడానికి సిద్ధమవుతున్నది. యూరో తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనమవడంతో వచ్చే నెలలో ధరలు పెంచకతప్పదని కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో హర్దీప్ సింగ్ బ్రార్ తెలిపారు. ఇప్పటికే సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వచ్చేలా వాహన ధరలను మూడు శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సంస్థ రూ.45.3 లక్షలు మొదలుకొని రూ.2.54 కోట్ల లోపు ధర కలిగిన పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. ఈ ఏడాది యూరోతో పోలిస్తే రూపాయి విలువ 93 నుంచి 95 స్థాయిలో ఉంటుందని అంచనావేసినప్పటికీ ప్రస్తుతం 103-105 స్థాయికి పడిపోయిందని, దీంతో ధరలు పెంచకతప్పదని ఆయన చెప్పారు.

## రూపాయికి ఊచకోత..
## ఫారెక్స్ మార్కెట్‌లో ఆగని నష్టాలు

**డాలర్ ముందు దేశీ కరెన్సీ విలవిల**
**ఆల్‌టైమ్ కనిష్ఠానికి మారకపు విలువ**
**90.32 స్థాయికి పతనం**
**మరో 38 పైసలు దిగజారిన వైనం**
**ఇంట్రా-డేలో 90.48కి క్షీణత**



**ముంబై, డిసెంబర్ 11**

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ దారుణంగా పడిపోతున్నది. ఇప్పటికే ఆల్‌టైమ్ కనిష్ఠాల వద్ద కదలాడుతున్న దేశీయ కరెన్సీ.. గురువారం మరింత దిగజారి మునుపెన్నడూలేని స్థాయికి క్షీణించింది. 38 పైసలు నష్టపోయి ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ వద్ద 90 మార్కుకు ఎగువన 90.32 దగ్గర నిలిచింది. దీంతో ఈ నెల 3న నమోదైన 90.15 ఆల్‌టైమ్ లో రికార్డు కనుమరుగైపోయింది. ఇక ఒకానొక దశలోనైతే దిగుమతిదారుల నుంచి డాలర్లకు విపరీతమైన డిమాండ్ రావడంతో రూపీ వాల్యూ ఏకంగా 90.48 స్థాయికి దిగజారింది. తిరిగి కోలుకోవడంతో ఫారెక్స్ ట్రేడర్లు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంట్రా-డేలో ఇదే రికార్డు కనిష్ఠం. ఈ నెల 4న 90.43 స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే.

ఆర్థికానికి దెబ్బ


రూపాయి పతనం.. దేశ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేస్తుంది. అన్ని విదేశీ దిగుమతులు భారమైపోతాయి. దీనివల్ల అటు ద్రవ్యోల్బణం విజృంభించడమేగాక, ఇటు దేశంలోని డాలర్ నిల్వలూ కరిగిపోతాయి. విదేశీ వాణిజ్యం మొత్తం ప్రపంచ కరెన్సీగా ఉన్న అమెరికా డాలర్లలోనే జరుగుతుంది మరి. అందుకే దిగుమతిదారుల నుంచి డాలర్లకు అంత డిమాండ్. వాస్తవానికి రూపాయి నష్టాల దృష్ట్యా ఆయా దేశాలతో స్థానిక కరెన్సీల్లో వ్యాపారానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పావులు కదుపుతున్నది. కానీ ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉండటం లేదు. ఇక ప్రస్తుతం దేశీయ ఇంధన అవసరాలు 85 శాతానికిపైగా విదేశాల నుంచి చేసుకుంటున్న ముడి చమురు దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఈ క్రమంలో రూపాయి బలహీనత క్రూడాయిల్‌ను ఖరీదెక్కిస్తుంది. నిజానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఇప్పుడు క్రూడ్ ధరలు గతంతో పోల్చితే తక్కువగానే ఉన్నాయి. కానీ కేవలం రూపీ నష్టం కారణంగా అధికంగా చెల్లించాల్సి వస్తున్నది. ఒక్క క్రూడాయిల్ విషయంలోనే కాదు.. దిగుమతయ్యే మిగతా అన్ని వస్తూత్పత్తులదీ ఇదే దుస్థితి. పరిస్థితులు ఇలాగే ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావమే పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## వెండి ఏ 1,94,400.. ఆల్‌టైమ్ హై రికార్డుకు ధర

**మరో రూ.2,400 పెరుగుదల**

న్యూఢిల్లీ,

బులియన్ మార్కెట్‌లో వెండి ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గురువారం ట్రేడింగ్‌లో మరో రూ.2,400 ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా కిలో విలువ రూ.1,94,400 పలికింది. దీంతో భారతీయ విపణిలో సరికొత్త రికార్డు నమోదైంది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనం కావడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీరేటును పావు శాతం తగ్గించడం, అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సిల్వర్‌కు డిమాండ్ కనిపించడం వంటివి.. దేశీయ మార్కెట్‌లో ధరల్ని పరుగులు పెట్టించాయని నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. బుధవారం ఏకంగా కిలో రేటు రూ.11,500 పెరిగిన విషయం తెలిసిందే. ఇక ఈ ఏడాదిలో ఇప్పటిదాకా వెండి ధర రూ.1,04,700 (116.72 శాతం వృద్ధి) పెరగడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్ 31న కిలో రేటు రూ.89,700గానే ఉన్నది మరి. ఇక గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ వెండి 62.88 డాలర్లుగా ఉన్నది. క్రితం రోజు ముగింపుతో చూస్తే 1.06 డాలర్లు లేదా 1.71 శాతం పెరిగింది. కాగా, సాధారణ కొనుగోలుదారులతోపాటు నాణేల తయారీదారులు, వివిధ రకాల ఇండస్ట్రీ వర్గాల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉందని వ్యాపారులు చెప్తున్నారు. ఇటీవలికాలంలో మదుపరులు సైతం వెండిపై పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తున్నారని, ఆయా దేశాల రిజర్వ్ బ్యాంకులు కూడా సిల్వర్ రిజర్వులను పెంచుకుంటున్నాయని పేర్కొంటున్నారు. అందుకే ధరలు ఈ స్థాయిలో పెరుగుతూపోతున్నాయని అంటున్నారు. ఈ ఉత్సాహం ఇలాగే కొనసాగితే కిలో ధర రూ.2 లక్షల మార్కును దాటడానికి ఎంతో సమయం పట్టకపోవచ్చన్న అంచనాలు గట్టిగానే వినిపిస్తున్నాయి.



## సఫారీల బదులు..
## రెండో టీ20లో భారత్‌పై ఘనవిజయం

**డికాక్ మెరుపు ఇన్నింగ్స్**
**సమష్టిగా విఫలమైన టీమ్‌ఇండియా**



**ముల్లాన్‌పూర్**

భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలి పోరులో ఎదురైన ఓటమికి దక్షిణాఫ్రికా బదులు తీర్చుకుంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆ జట్టు 51 పరుగుల తేడాతో మెన్ ఇన్ బ్లూను ఓడించి జయభేరి మోగించింది. సౌతాఫ్రికా నిర్దేశించిన 214 పరుగుల రికార్డు ఛేదనలో టీమ్‌ఇండియా.. 19.1 ఓవర్లలో 162 రన్స్‌కే ఆలౌట్ అయింది. టాపార్డర్ విఫలమవగా తిలక్ వర్మ (34 బంతుల్లో 62, 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) పోరాడినా అతడికి అండగా నిలిచేవారు లేకపోవడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. క్వింటన్ డికాక్ (46 బంతుల్లో 90, 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో నిర్ణీత ఓవర్లలో 213/4 పరుగుల భారీ స్కోరుచేసింది. భారత పేసర్లు అర్ష్‌దీప్, బుమ్రా దారుణంగా విఫలమైనా వరుణ్ చక్రవర్తి (2/29) ఫర్వాలేదనిపించాడు. డికాక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఇరుజట్ల మధ్య మూడో టీ20 ఈనెల 14న ధర్మశాలలో జరుగుతుంది.

డికాక్ దంచుడు

ఇటీవలే పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన డికాక్.. టీ20ల్లో రెండు దకౌట్ల తర్వాత తన విలువను చాటే ఇన్నింగ్స్‌ను ఆడాడు. ఆరంభం నుంచే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన డికాక్ క్రీజులో ఉన్నంతసేపు సఫారీ స్కోరు రాకెట్ వేగాన్ని తలపించింది. అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లోనే సిక్స్‌తో పరుగుల వేటను ఆరంభించిన డికాక్.. అతడితో పాటు బుమ్రాను టార్గెట్ చేశాడు. అర్ష్‌దీప్ 3వ ఓవర్లో 4,6తో 12 రన్స్ రాబట్టిన అతడు.. బుమ్రా ఓవర్లోనూ సిక్స్ కొట్టాడు. వరుణ్ తొలి బంతికే రీజా హెండ్రిక్స్ (8)ను ఔట్ చేసినా డికాక్ జోరు తగ్గలేదు. హార్దిక్ 9వ ఓవర్లో బౌండరీతో 26 బంతుల్లోనే అతడి హాఫ్ సెంచరీ పూర్తయింది.

11వ ఓవర్లో అర్ష్‌దీప్ ఏకంగా ఏడు వైడ్లు వేయడంతో పాటు మొత్తంగా 18 రన్స్ ఇచ్చాడు. మార్క్రమ్ (29).. వరుణ్ 12వ ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టినా ఆఖరి బంతికి అక్షర్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చాడు. శతకం దిశగా సాగుతున్న డికాక్‌ను వరుణ్ తన ఆఖరి బోల్తా కొట్టించాడు. బ్రెవిస్ (10)ను అక్షర్ పెవిలియన్‌కు పంపినా ఆఖర్లో ఫెరీరా (16 బంతుల్లో 30ని, 1 ఫోర్, 3 సిక్స్‌లు) మిల్లర్ (12 బంతుల్లో 20ని, 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సఫారీలకు భారీ స్కోరు కట్టబెట్టారు.

తిలక్ పోరాడినా..

ఛేదనలో భారత టాపార్డర్ మరోసారి నిరాశపరిచింది. మొదటి 4 ఓవర్లలోనే మూడు కీలక వికెట్లను కోల్పోయి ఛేదనను మరింత కష్టతరం చేసుకుంది. గిల్ తానెదుర్కొన్న తొలి బంతికే డకౌట్ అవగా కెప్టెన్ సూర్య (5) చెత్త ఫామ్‌ను కొనసాగించాడు. రెండు సిక్సర్లు కొట్టిన అభిషేక్ (17)దీ అదేబాట! బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన అక్షర్ పటేల్ (21) సైతం ఆకట్టుకోలేకపోయాడు. 32 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన తిలక్.. ఆరంభంలో దూకుడుగా ఆడి 27 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తిచేశాడు. హార్దిక్ (21) వేగంగా ఆడలేకపోయినా జితేశ్ (27), తిలక్ పోరాడారు. అయితే ఆఖరి 3 ఓవర్లలో 72 రన్స్ కావాల్సి ఉండటంతో ఛేదన కష్టమేనని తేలిపోయింది. వేగంగా ఆడే క్రమంలో జితేశ్ నిష్క్రమించడంతో భారత ఓటమి ఖరారైంది.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 213/4 (డికాక్ 90, ఫెరీరా 30, వరుణ్ 2/29, అక్షర్ 1/27)బీ

భారత్: 19.1 ఓవర్లలో 162 (తిలక్ 62, జితేశ్ 27, బార్ట్‌మన్ 4/24, యాన్సెన్ 2/25)

# స్పోర్ట్స్

## వరల్డ్‌కప్ మేనియా షురూ..
## భారత మ్యాచ్ టికెట్‌తో సూర్య..!




వచ్చే ఏడాది జరుగబోయే పురుషుల టీ20 ప్రపంచకప్ టికెట్లు వచ్చేశాయి. నవంబర్ 25న పూర్తి షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ.. డిసెంబర్ 11న సాయంత్రం 6:45 నుంచి టికెట్లు అమ్మకాలను ప్రారంభించింది. అయితే.. కో-హోస్ట్ అయిన భారత గడ్డపై వరల్డ్ కప్ తొలి టికెట్లను అనుకున్న సమయం కంటే ముందుగానే విడుదల చేశారు. భారత్, దక్షిణాఫ్రికా రెండో టీ20 మ్యాచ్ టాస్ పూర్తయ్యాక మైదానంలోనే ప్రపంచకప్ టికెట్లతో ఇరుజట్ల కెప్టెన్లు ఫొటోలు దిగారు. పొట్టి ప్రపంచకప్ ఆరంభం రోజే భారత్, యూఎస్ఏతో తలపడనుంది. సో.. ఈ మ్యాచ్ టికెట్‌ను కామెంటేటర్ రవి శాస్త్రి, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కలిసి విడుదల చేశారు. ఇద్దరూ నవ్వులు చిందిస్తూ ఆ టికెట్‌తో ఫొటో దిగారు. సఫారీ లెజెండ్ డేల్ స్టెయిన్, మర్క్‌రమ్ సైతం తమ జట్టు తొలి పోరు టికెట్‌తో మురిసిపోయారు. దక్షిణాఫ్రికా, కెనడా మ్యాచ్ టికెట్‌తో వీరిద్దరూ కెమెరాకు పోజిచ్చారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి ప్రపంచకప్ ఫిబ్రవరి 7 టోర్నీ ప్రారంభం కానుంది. ఇరుదేశాల్లోని ఎనిమిది నగారాల్లో ఈ మెగా టోర్నీ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

## క్వార్టర్స్‌కు భారత్ స్క్వాష్ వరల్డ్‌కప్

చెన్నై

స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ తమిళనాడు (ఎస్‌డీఏటీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్క్వాష్ వరల్డ్ కప్‌లో భారత జట్టు క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. చెన్నైలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భారత జట్టు.. పూల్ 'బీ'లో 3-0 (7-5, 7-2, 7-2)తో బ్రెజిల్‌ను చిత్తుచేసింది. నేషనల్ చాంపియన్ వెలవన్ సెంథిల్‌కుమార్, యువ సంచలనం అన్వ త్ సింగ్‌తో పాటు అభయ్ సింగ్ వరుస విజయాలతో బ్రెజిల్‌ను చిత్తుచేశారు. శుక్రవారం జరుగబోయే క్వార్టర్స్‌లో భారత్.. దక్షిణాఫ్రికాతో ఆడుతుంది.






# చిరుతలో రామ్‌చరణ్‌లా ఉన్న రోషన్ కనకాల


## మోగ్లీ ప్రీ రిలీజ్ వేడుకల్లో నటుడు రానా కితాబు

రోషన్ కనకాలను చూస్తుంటే తనకు 'చిరుత'లో రామ్ చరణ్‌ను చూసినట్లు ఉందని నటుడు రానా అన్నారు. రోషన్ కనకాల హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మోగ్లీ 2025'. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. డిసెంబర్ 13న విడుదల కానుంది. తాజాగా ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఆ వేడుకకు రానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇదిలావుంటే రానా, విష్ణు విశాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరణ్య'. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అడవి, ఏనుగుల రక్షణ కోసం పాటుపడే వ్యక్తిగా రానా నటించారు. తాజాగా రానా ఆ సినిమా షూటింగ్ రోజులను గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశంలోకి ఏనుగుల గుంపు వచ్చిందని చెప్పారు. అరణ్య షూటింగ్ కోసం ఆరు నెలలు అడవిలో ఉన్నాం. మేము కొన్ని సన్నివేశాలను ఏనుగులు ఉండే ప్రాంతంలో చేశాం. సాయంత్రం సమయానికి వెళ్లిపోవాలి అన్నారు. అనుకున్న టైమ్‌కు మన షూటింగ్‌లు ఎప్పుడూ ముగించరని అందరికీ తెలిసిందే. దీంతో రాత్రి వరకూ అక్కడే ఉన్నాం. నేను సన్నివేశంలో భాగంగా దూరంగా ఉన్నాను. సడన్‌గా అందరూ గబగబా వెళ్లిపోతున్నారు. ఎందుకు ఇలా పరిగెడుతున్నారు అని చూసేసరికి ఏనుగులు మా వైపునకు వస్తున్నాయి. దీంతో నేను, మరికొంతమంది వాటికి కనిపించకుండా చెట్ల చాటుకు వెళ్లాం. కొంచెం కూడా శబ్దం చేయకుండా అలానే మూడు గంటలు ఉన్నాం. ఆ చిమ్మచీకట్లో అలా మూడు గంటలు ఉండడం ఎప్పటికీ మర్చిపోలేను. అడవి ఎంత భయంకరంగా ఉంటుందో మొదటిసారి అప్పుడే అర్థమైంది అని రానా ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. 'నేనే రాజు.. నేనే మంత్రి' తర్వాత రానా నటించిన సినిమా 'అరణ్య'. కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత విడుదలైన తొలి పాన్ ఇండియా చిత్రం కూడా ఇదే. ఇందులో రానా ఫారెస్ట్ మేన్‌గా నటించారు. సందేశాత్మక చిత్రంగా ఆకట్టుకుంది.




# ఓటిటిలోకి వచ్చేసిన '12ఏ రైల్వే కాలనీ'

అల్లరి నరేష్ నటించిన '12ఏ రైల్వే కాలనీ' సినిమా నవంబర్ 21న థియేటర్లలో విడుదలై పెద్దగా ఆడియన్స్‌ను ఆకట్టుకోలేకపోయింది. సూపర్ నేచురల్ థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకున్న నరేష్ ఈ సినిమా ద్వారా విభిన్నమైన ప్రయోగం చేశాడు. నాని కసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటించగా, కథను ప్రముఖ రచయిత, దర్శకుడు పొలిమేర అందించారు. టీజర్, ట్రైలర్ విడుదలైనప్పుడు ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అల్లరి నరేష్ కామెడీ హీరో ఇమేజ్ నుంచి బయటకు వచ్చి సీరియస్ హారర్ జానర్‌లో అడుగుపెడుతుండటం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. అయితే సినిమా రిలీజ్ అయిన తర్వాత మాత్రం మిశ్రమ స్పందన వచ్చింది. కథనం రొటీన్‌గా ఉందని, హారర్ ఎలిమెంట్స్ కూడా పెద్దగా కనెక్ట్ కాలేదని ప్రేక్షకులు పేర్కొన్నారు. దీంతో చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభావం చూపడంలో విఫలమైంది. బాక్సాఫీస్ కలెక్షన్లు ఆశించిన స్థాయికి చేరకపోవడంతో మేకర్స్ పెద్దగా గ్యాప్ లేకుండా ఈ సినిమాను ఓటిటీలోకి తీసుకువచ్చారు. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమాకు ఓటిటీ హక్కులు దక్కించుకుంది.




# లేడీ మాఫియా డాన్ పాత్రలో కాజల్ అగర్వాల్

అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ తెలుగులో తొలిసారి వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నట్లు తెలిసింది. 'విశాఖ' పేరుతో తెరకెక్కిస్తున్న ఈ సిరీస్‌కు సుధీర్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నట్లు సమాచారం. హిందీలో సుస్మితాసేన్ నటించిన 'ఆర్య' వెబ్‌సిరీస్‌కు రీమేక్ ఇదని అంటున్నారు. ఇందులో కాజల్ అగర్వాల్ మాఫియా డాన్ పాత్రను పోషిస్తున్నట్లు తెలిసింది.నగరంలో ఓ మాఫియా డాన్ ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురవుతాడు. వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆయన భార్య మాఫియా డాన్‌గా అవతారమెత్తుతుంది. ఈ నేపథ్యంలో చోటుచేసుకునే సంఘటనల నేపథ్యంలో సాగే కథాంశమిది.తెలుగులో కాజల్ అగర్వాల్ నటిస్తున్న తొలి వెబ్‌సిరీస్ ఇదే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది 'కన్నప్ప' చిత్రంలో అతిథి పాత్రలో మెరిసింది కాజల్ అగర్వాల్. ప్రస్తుతం ఈ భామ హిందీలో 'రామాయణ' సిరీస్ చిత్రాలతో పాటు 'ది ఇండియన్ స్టోరీ' అనే చిత్రంలో నటిస్తున్నది.



# హ్యాకర్ కోసం వేట

అది పినిశెట్టి హీరోగా రూపొందుతున్న థ్రిల్లర్ మూవీ 'డ్రైవ్'. మడోన్నా సెబాస్టియన్ కథానాయిక. జెనూస్ మొహమద్ దర్శకుడు. వి.ఆనంద్‌ప్రసాద్ నిర్మాత. ఈ నెల 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. మీడియా సంస్థకు అధిపతి అయిన 'జే'.. తన ఫియాన్సీతో లండన్‌లో స్థిరపడేందుకు సిద్ధమవుతున్న తరుణంలో అతని సంస్థ అకౌంట్సన్నీ ఓ హ్యాకర్ హ్యాక్ చేస్తాడు. 'జే' ప్రతి మూమెంట్‌ని గమనిస్తూ అతడ్ని చంపేస్తానని బెదిరిస్తుంటాడు.తన మీడియా సంస్థకు చెందిన విషయాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంచుతూ సంస్థ గౌరవాన్ని రోడ్డున పడేస్తాడు. తన వ్యక్తిగత జీవితంతో ఆడుకుంటున్న ఆ హ్యాకర్‌ని 'జే' ఎలా పట్టుకున్నాడు? అసలు ఆ హ్యాకర్ ఎవరు? అనే అంశాలు ట్రైలర్‌లో ఆసక్తిగా చూపించారు. ఈ చిత్రానికి మాటలు: నాగసాయి, కెమెరా: అభినందన్ రామానుజన్, సంగీతం: ఓషో వెంట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అన్నే రవి, నిర్మాత: వి.ఆనంద్‌ప్రసాద్, నిర్మాణం: భవ్య క్రియేషన్స్.




# కార్తీ అభిమానులకు షాక్.. అన్నగారు వొస్తారు రిలీజ్‌పై స్టే

కోలీవుడ్ స్టార్ యాక్టర్ కార్తీ నటిస్తోన్న చిత్రం వా వాతియార్. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్నాడు. ఉప్పెన ఫేం కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం తెలుగులో అన్నగారు వస్తారు టైటిల్‌తో రిలీజ్ కానుంది.ఈ మూవీ డిసెంబర్ 12న విడుదల కావాల్సి ఉండగా.. ఊహించని విధంగా వాయిదా పడ్డది. తాజా అప్‌డేట్ ప్రకారం ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అన్నగారు వొస్తారు రేపు విడుదల కావడం లేదు. సినిమా నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు కోర్టు సినిమా రిలీజ్‌పై మధ్యంతర స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.అన్నగారు వొస్తారు యూఎస్‌ఏ డిస్ట్రిబ్యూటర్ సినిమా విడుదల వాయిదా విషయాన్ని ప్రేక్షకులకు తెలియజేశాడు. తమ అభిమాన హీరో సినిమాను మరికొన్ని గంటల్లో థియేటర్లలో చూసేందుకు రెడీ అవుతున్న మూవీ లవర్స్‌కు తీవ్ర నిరాశ కలిగించే విషయమనే చెప్పాలి. అన్నగారు వొస్తారు కూడా అఖండ 2 (ముందుగా నిర్ణయించిన ప్రకారం) డిసెంబర్ 5న విడుదల కావాల్సి ఉండగా.. పెండింగ్ వర్క్ కారణంగా డిసెంబర్ 12న రిలీజ్ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కార్తీ తన సినిమాకు బాలకృష్ణ అఖండ 2 లాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్నాడని చర్చ నడుస్తోంది. ఈ లెక్కన మరి కార్తీ సినిమా ఎప్పుడు థియేటర్లకు వస్తుందనేది చూడాలి. అన్నగారు వొస్తారు చిత్రంలో సత్యరాజ్, రాజ్‌కిరణ్, జీఎం సుందర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.